teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 230 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 24 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ‹ 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం

హాజరుకానున్న 9.97 లక్షల మంది విద్యార్థులు

రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాల ఏర్పాటు






# మరోసారి సుప్రీంకోర్టుకు

## "తిరుమల లడ్డూ కల్తీ వివాదం"

### ఏపీ ఏకసభ్య కమిటీకి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారనే వివాదం మరోసారి సుప్రీంకోర్టు గడప తొక్కింది. సిట్ విచారణ నివేదిక అనంతరం ఏపీ ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రత్యేకంగా ఒక ఏకసభ్య కమిటీని నియమించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సోమవారం సుప్రీం ధర్మాసనం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టి సంచలన తీర్పును వెలువరించింది. తిరుమల లడ్డూ కేసులో ఏపీ ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిటీ దర్యాప్తు కొనసాగించవచ్చని ధర్మాసనం తేల్చి చెప్పింది.

02



## నా పేరుతో సంస్థలు పెట్టొద్దు

కేటీఆర్ కీలక ప్రకటన

కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేన సంస్థలకు గుర్తింపు లేదు

స్పష్టం చేసిన కేటీఆర్

.. వివరాలు 2లో



## సృష్టి సరోగసీ కేసులో దర్యాప్తు వేగవంతం

డాక్టర్ నమ్రతకు 2 రోజుల ఈడీ కస్టడీ

సరోగసీ అక్రమాల, ఆర్థిక మూలాలపై ఈడీ నజర్

.. వివరాలు 2లో



## బంగారం దిగుమతులపై ఆందోళన వద్దు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

.. వివరాలు 2లో

## హైదరాబాద్ మెట్రోపై సర్కార్ సంచలన నిర్ణయం

### ఎల్అండ్‌టీ నుంచి పూర్తిగా స్వాధీనం

### బాధ్యతలను తీసుకునేలా మంత్రిమండలి నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ మంత్రి మండలి సమావేశం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రోను ఎల్‌డటీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి కీలక అడుగులు పడుతున్నాయి. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టును

మిగతా 2 లో






## తేజస్ కూలిపోలేదు

- కేవలం సాంకేతిక లోపమే
- క్లారిటీ ఇచ్చిన హెచ్ఏఎల్
- తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని వెల్లడి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): స్వదేశీ తయారీ యుద్ధ విమానం 'ఎల్సీఏ తేజస్' ఈ నెల 7వ తేదీన కూలిపోయిందంటూ వస్తున్న వార్తలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తీవ్రంగా ఖండించింది. అది ప్రమాదం కాదని, కేవలం రన్‌వేపై జరిగిన చిన్న సాంకేతిక లోపం మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు

మిగతా 2 లో

## పెళ్లి ముసుగులో పొంచి ఉన్న ముప్పు

### యువతులను నయవంచన చేస్తున్న కేటుగాళ్లు

### యువతులు తస్మాత్ జాగ్రత్త: సీపీ సజ్జనార్



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): పెళ్లి ముసుగులో పొంచి ఉన్న ప్రమాదాలపై సోమవారం ఎక్స్ వేదికగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అమ్మాయిలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ ట్వీట్ చేస్తూ 'హైదరాబాద్ లో పెళ్లి పేరుతో

మిగతా 2 లో



## మన ఊరు - మన బడి బిల్లులు విడుదల చేయాలి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): రెండున్నరేళ్లుగా బిల్లులు రాక, అప్పులపాలై తీవ్ర మనోవేదనకు గురవుతున్న 'మన ఊరు మన బడి' సివిల్ కాంట్రాక్టర్లు సోమవారం నన్ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారని బీఆర్ఎస్ నేత

మిగతా 2 లో




## టీజీ ఎడ్ సెట్ నోటిఫికేషన్ విడుదల

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.. మే 12న పరీక్ష

హన్మకొండ, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీజీ ఎడ్ సెట్- 2026 నిర్వహిస్తున్నట్లు కాకతీయ

మిగతా 2 లో

## తెలంగాణ ఉద్యమకారులకు ఊరట


### హైకోర్టు కీలక ఆదేశాలు

### 250 గజాల ఇళ్ల స్థలం, పెన్షన్ మంజూరు చేయాలి

### 8 వారాల్లోగా అమలు చేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సంబంధించి అభయహస్తం పథకం అమలు విషయంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో

మిగతా 6 లో




# మరోసారి సుప్రీంకోర్టుకు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారనే వివాదం మరోసారి సుప్రీంకోర్టు గడప తొక్కింది. సిట్ విచారణ నివేదిక అనంతరం ఏపీ ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రత్యేకంగా ఒక ఏకసభ్య కమిటీని నియమించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సోమవారం సుప్రీం ధర్మాసనం ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టి సంచలన తీర్పును వెలువరించింది. తిరుమల లడ్డూ కేసులో ఏపీ ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిటీ దర్యాప్తు కొనసాగించవచ్చని ధర్మాసనం తేల్చి చెప్పింది. అదేవిధంగా ఆ ప్రత్యేక కమిటీ ఓవర్‌లాపింగ్ కిందికి రాదని కోర్టు స్పష్టం చేసింది. కాగా, ఇప్పటికే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేసిన తరుణంలో, మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం మరో కమిటీని నియమించడంపై సుబ్రహ్మణ్య స్వామి తీవ్ర అభ్యంతరం వ్యక్తం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, సిట్, సీబీఐ, టీటీడీలను ప్రతివాదులుగా చేర్చారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని పేర్కొన్నారు. అయితే సింథటిక్ నెయ్యి, పామాయిల్ వంటి పదార్థాలతో భారీ ఎత్తున కల్తీ జరిగిందని వెల్లడించారు. ఈ నివేదికపై తదుపరి చర్యల కోసం ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయగా అది సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమని సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేయడం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే.

# పెళ్లి ముసుగులో పొంచి ఉన్న ముప్పు

మొదటి పేజీ తరువాయి



జరుగుతున్న మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం ప్రేమ పేరుతోనే కాదు, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా కొందరు నయవంచకులు యువతులను మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై ఇటీవల హైదరాబాద్ షీ టీమ్స్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి' అని తెలిపారు.

### మోసం జరుగుతున్న తీరు ఇదీ

ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, ఆపై ఎంగేజ్‌మెంట్ జరిపించుకుంటున్నారని తెలిపారు. పెళ్లి ఖాయమైంది కదా అనే చనువుతో యువతులకు దగ్గరవుతున్నారని, ఎలాగూ పెళ్ళే కదా ఇప్పుడైతే ఏంటి? అని మాయమాటలు చెప్పి, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి, ఒత్తిడితో శారీరకంగా లోబచుకుంటున్నారని ఆయన ట్వీట్ పేర్కొన్నారు. తీరా తమ కోరిక తీరాక అసలు రంగు బయటపెడుతున్నారు. పెళ్లి పీటలు ఎక్కాలంటే తమకు భారీగా డబ్బు కావాలని, అదనపు కట్నం ఇస్తేనే తాళి కడతామని డిమాండ్ చేస్తున్నారని, లేదంటే పెళ్లి రద్దు చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. నిశ్చితార్థం జరిగిపోవడం, బంధుమిత్రులందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు పెళ్లి ఆగిపోతే సమాజంలో తమ పరువు ఎక్కడ పోతుందోనన్న భయంతో చాలా మంది యువతులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారని వెల్లడించారు. ఇదే అదునుగా భావిస్తున్న కేటుగాళ్ళు, అడిగినంత డబ్బు ఇవ్వాలంటూ వేధిస్తున్నారని సూచించారు. పరువు పోతుంది అని భయపడి మౌనంగా ఉ ంటే, జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. నిశ్చితార్థం అయినా సరే, పెళ్లి పీటలు ఎక్కేవరకు అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు.

### పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా


పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా అని గుడ్డిగా నమ్మొద్దు అని సూచించారు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై ఆరా తీయాలన్నారు. పెళ్లికి ముందే ఏకాంతంగా కలవడానికి, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే కచ్చితంగా అనుమానించాలని, ధైర్యంగా తిరస్కరించాలని సూచించారు. డబ్బు డిమాండ్ చేసినా, బ్లాక్ మెయిల్ చేసినా భయపడొద్దని, ఫిర్యాదు చేయండని సూచనలు చేశారు. మోసగాళ్ల చేతిలో చిక్కుకున్న వారు ఎలాంటి భయం లేకుండా ముందుకు రావాలి.. మీ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ఇలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555కు గానీ, డయల్ 100 కు గానీ కాల్ చేయండి అని సజ్జనార్ సూచించారు.

# టీజీ ఎడ్ సెట్ నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రతాపరెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో టీజీ ఎడ్ సెట్ 2026 నోటిఫికేషన్ విడుదల చేసి తేదీలను ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హత కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 23నుంచి ఆన్ లైన్ అప్లికేషన్ లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు దివ్యాంగుల విద్యార్థులకు ₹ 550 ఫీజు, బిసి, ఓసీలకు ₹ 750 గా ఫీజు చెల్లించాలని ఏప్రిల్ 15 చివరి తేదీగా పేర్కొన్నారు. ఏప్రిల్ 22 నుండి అదనపు రుసుము ₹ 250, ఏప్రిల్ 27నుండి 500రూపాయల తో అదనపు రుసుము, ఏప్రిల్ 30 నుండి 1000రూపాయలు అదనపు రుసుముతో ఫీజు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ నమోదులో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి అవకాశం మే 2 తేదీ గా అవకాశం ఇస్తున్నట్లు, చివరి నిమిషంలో విద్యార్థులు ఆన్ లైన్ లో నమోదు చేయాలనుకునే విద్యార్థులకు మే 8 తేదీ నుంచి 9వ తేదీ లోపు 5000 రూపాయల అపరాధ రుసుముతో అప్లయ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం మే 4తేదీ న పరీక్ష కేంద్రాల నిర్దారణ విడుదల చేయనున్నట్లు మే 9వ తేదీన హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకునే అవకాశం వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 16సెంటర్లలో పరీక్ష కేంద్రాలు పరీక్ష నిర్వహణ నిర్వహించనున్నట్లు, మే 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు, రెండోవ సెక్షన్ లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, పరీక్ష పరీక్షలు నిర్వహించబడతాయని వీటికి సంబంధించిన పరీక్ష కీ మే 15వ తేదీన విడుదల చేయనున్నట్టు తెలిపారు.

# సృష్టి సరోగసీ కేసులో దర్యాప్తు వేగవంతం



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### రెండు రోజుల కస్టడీకి అనుమతి

డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళ, బుధ రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు.

# బంగారం దిగుమతులపై ఆందోళన వద్దు



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): దేశీయంగా బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇదే సమయంలో బంగారం ధరలను ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. సాంప్రదాయంగా పండుగ సీజన్‌లో వీటి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి, కానీ ఇప్పటివరకు నిర్దిష్ట పరిమితులను దాటలేదు. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) బోర్డు డైరెక్టర్లతో బడ్జెట్ తర్వాత జరిగే సాధారణ సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు బంగారం ధరలను పరిశీలిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు భారీగా కొనుగోళ్లు చేయడమే బంగారం ధరల పెరుగుదలకు కారణమన్నారు. దిగుమతుల గురించి ఆందోళన అక్కరలేదు, కరెంట్ ఖాతా లోటు నిర్వహించే స్థాయిలోనే ఉందన్నారు. పసిడి మనదేశంలో ఒక పెట్టుబడి సాధనంగా ఉంటుంది, పండుగ సీజన్‌లో హెచ్చుతగ్గులు సాధారణం. కాబట్టి, ఈ పరిస్థితులను తాము గమనిస్తున్నామని వివరించారు. ఆర్‌బీఐ కూడా ధరల హెచ్చుతలను గమనిస్తూ ఉంటుంది. అనేక దేశాలు, ముఖ్యంగా వివిధ సెంట్రల్ బ్యాంకులు బంగారం, వెండిని కొని, నిల్వ చేస్తున్నాయని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

### యూఎస్ టారిఫ్

ఈ సందర్భంగా అమెరికా టారిఫ్ అంశంపై ఆర్థిక మంత్రి స్పందించారు. ఈ విషయాన్ని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సమీక్షిస్తోందన్నారు. ఇప్పటికిప్పుడు టారిఫ్‌ల అంశంపై మాట్లాడటం తొందరపాటు అవుతుంది. తదుపరి చర్చలకు ఎప్పుడు వెళ్లాలో ప్రతినిధుల బృందం నిర్ణయం తీసుకోవల్సి ఉంటుంది. కాబట్టి తాను వ్యాఖ్యానించడం కూడా తొందరపాటేనని సీతారామన్ అన్నారు. గత శుక్రవారం (ఫిబ్రవరి 20) అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విధించిన భారీ దిగుమతి సుంకాలకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత, ట్రంప్ ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు భారత్‌తో సహా అన్ని దేశాలపై 10 శాతం సుంకాన్ని విధించారు. అనంతరం శనివారం (ఫిబ్రవరి 21) ఈ సుంకాలను 15 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు.

# తేజస్ కూలిపోలేదు



మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా వేదికగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సరిహద్దులకు సమీపంలోని ఒక ఎయిర్‌బేస్‌లో సాధారణ శిక్షణ ముగించుకుని ల్యాండ్ అవుతున్న సమయంలో తేజస్ విమానం అదుపు తప్పినట్లు సమాచారం. బ్రేకింగ్ వ్యవస్థలో తలెత్తిన లోపం కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అయితే, విమానం పూర్తిగా దెబ్బతిన్నట్లు వస్తున్న వార్తలపై స్పందించని హల్ తేజస్ ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డు కలిగిన యుద్ధవిమానాల్లో ఒకటి అని పేర్కొంది. ప్రస్తుతం వైమానిక దళంతో కలిసి ఆ సాంకేతిక సమస్యను విశ్లేషిస్తున్నట్లు తెలిపింది.

# హైదరాబాద్ మెట్రోపై "సర్కార్ సంచలన నిర్ణయం"

మొదటి పేజీ తరువాయి

మొత్తం 86.1 కిలోమీటర్ల పొడవునా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భారీ విస్తరణ కోసం సుమారు రూ. 19,579 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఇటీవలే మెట్రో రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ సైతం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిగా మెట్రోను స్వాధీనం చేసుకోవడం ఆసక్తిగా మారింది.

# నా పేరుతో సంస్థలు పెట్టొద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తన పేరుతో ఎలాంటి సంస్థను కూడా ఏర్పాటు చేసేందుకు తన అనుమతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని కార్యకలాపాలు చేపడుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి పలువురు తీసుకొచ్చారు. దీనితోపాటు కేటీఆర్ పేరుతో ఇతర సంస్థలను ఏర్పాటు చేసుకున్న అంశాన్ని కూడా కేటీఆర్‌కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో తన పేరుతో ఎలాంటి సంస్థలకీ అనుమతి లేదని అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని కేటీఆర్ తెలిపారు. ఇలాంటి సంస్థలకు ఎటువంటి గుర్తింపు, అనుమతి లేదన్న విషయాన్ని అందరూ గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ఆపేయాలని తనపై అభిమానం ఉన్నవాళ్లు ఎవరైనా భారత రాష్ట్ర సమితితో కలిసి పనిచేయవచ్చని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# మన ఊరు - మన బడి "బిల్లులు విడుదల చేయాలి"



మొదటి పేజీ తరువాయి

హరీష్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు హరీష్ రావు ట్వీట్ చేశారు. 'కేసీఆర్ ప్రభుత్వంలో పేద విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాం. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1500 మంది చిన్న కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా కక్ష సాధిస్తోంది. అప్పులు తెచ్చి పనులు చేసిన వారు నేడు మిత్తీలు కట్టలేక రోడ్డున పడ్డారు. అప్పుల బాధతో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. చిన్న కాంట్రాక్టర్లకు పైసల్లేవంటున్న ప్రభుత్వం. పెయింటింగ్, బెంచీలు సరఫరా చేసిన బడా కంపెనీలకు మాత్రం రాత్రికి రాత్రే వందల కోట్లు ఎలా విడుదల చేసింది? మీకు కమీషన్లు ఇవ్వరనే ఈ చిన్న కాంట్రాక్టర్లను బిల్లును గాలికి వదిలేశారా ముఖ్యమంత్రి గారు అని హరీష్ రావు ప్రశ్నించారు.

### ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్ట

తమ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ప్రజావాణిలో మొరపెట్టుకున్నా, విద్యాశాఖ అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేదు. సీఎం అపాయింట్మెంట్ ఇవ్వరు. ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని వేడుకున్నా స్పందన లేదు. చివరికి, సచివాలయంలో ఆర్థిక మంత్రి చాంబర్ ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపితే వారిపై అక్రమ కేసులు బనాయించడం ఈ ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్ట. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై శాసనమండలి చైర్మన్ మండలి సాక్షిగా ఆవేదన వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయని, తమ సొంత ఊరి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. బిల్లులు విడుదల చేయాలని తాను స్వయంగా ముఖ్యమంత్రిని కోరినా బిల్లులు విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

### కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెట్టకండి

కనీసం ఇప్పుడైనా మన ఊరు – మన బడి కోసం ఆర్థిక శాఖ నుంచి విద్యాశాఖకు వచ్చిన నిధులనైనా ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సివిల్ కాంట్రాక్టర్లకు చెల్లిస్తారా? లేక ఆ డబ్బును కూడా కూడా బడా కాంట్రాక్టర్లకే కట్టబెడతారా?. పేద పిల్లల కోసం పాఠశాలలు బాగుచేసిన చిన్న కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెట్టకండి. వెంటనే ఆ 1500 మంది పెండింగ్ బిల్లులను విడుదల చేసి, వారిపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీష్ రావు పేర్కొన్నారు.

# డాక్టర్ రత్నం ముళ్ళపూడి మరణం తీరని లోటు



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): గజులరామారంలోని ఉషా ముళ్ళపూడి కార్డియాక్ సెంటర్ వ్యవస్థాపకులు, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ రత్నం ముళ్ళపూడి మరణం తీరని లోటు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి ఆయన. నేడు బిజెపి నాయకులు గజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు వారితోపాటు ఉషోదయ కాలనీ అధ్యక్షులు దేగుల సతీష్ బాబు, ప్రసాద్ కుంపట్ల శ్రీనివాస్ రమేష్ బాబు తదితర నాయకులు డాక్టర్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ రత్నం గజులరామారం ప్రాంతానికే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతో మంది గుండె రోగులకు ప్రాణదాతగా నిలిచారని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

**సూపరింటెండింగ్ ఇంజనీర్ వెల్లడి**

ములుగు జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ఎన్పీడీసియల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గత ఏడాది మార్చి నెలలో 5,816 మెగావాట్లు ఉండగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి 21 నాటికి 5,904 మెగావాట్లకు చేరిందని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అ.ఆనందం తెలిపారు. రాబోయే వేసవిలో పీక్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో లోడ్ పెరుగుదల అంచనాల మేరకు ఓవర్‌లోడ్ అవుతున్న పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 33 పెంచినట్లు తెలిపారు. అదనంగా పలు 49 కొత్త పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట్ల రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఏడు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు, విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపరిచేందుకు 27.35 ఖవీ 33/11 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. వేసవికాలంలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కంకణబద్ధంగా పనిచేస్తున్నారని సూపరింటెండింగ్ ఇంజనీర్ స్పష్టం చేశారు.

# ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమావేశం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఐడిఓసి కార్యాలయంలో డీఈఓ రాజేందర్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, సి సెంటర్ల కస్టోడియన్లు, రూట్ అది కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,544 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. 20 కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే సిబ్బంది పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు అనుమతి లేదని తెలిపారు. మార్చి 14వ తేది నుండి ప్రారంభం కానున్న పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో మొత్తం 3,544 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. అందులో బాలురు 1,701 మంది, బాలికలు 1,843 మంది ఉన్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించగా, మొత్తం 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు విధులు నిర్వర్తించనున్నారని అన్నారు. అలాగే 20 మంది డిపార్ట్ మెంటల్ అధికారులతో పాటు అదనంగా ప్రశ్నపత్రాల భద్రత కోసం 3 సి సెంటర్ కస్టోడియన్లు నియమించినట్లు వివరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు, మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలని డీఈఓ రాజేందర్ పిలుపునిచ్చారు. అంతకు ముందు పరీక్షల సహాయకులు కుసుమ కృష్ణ మోహన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగహన కల్పించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి రమేష్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాం లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీలో ఉద్యోగాలు

మహబూబాబాద్ జిల్లా , ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా మరిపెడ, తానంచెర్ల, కురవి, సీరోల్ కాంపల్లి, బయ్యారం, పాకాల, కొత్తగూడెం, గార్ల, దోర్నకల్, నెల్లికుదురు ప్రాంతాల్లో శ్రీ రాం లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ లోని వివిధ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయుటకు తేదీ.25.02.2026 న నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారిణి రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అభ్యర్థులు 20 నుండి 32 సంవత్సరాల వయసు కలిగి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. అనుభవం ఉన్నవారు మరియు ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఇందులో ఎంపిక అయిన వారికి నెలకు రూ. 17,000/- నుండి రూ. 50,000/- వరకు, అదనంగా ఇన్సెంటివ్స్, టా, డా మరియు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ తో వేతనాన్ని అందజేస్తారని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఆధార్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో జిల్లా కలెక్టరేట్ లోని రెండవ అంతస్తులో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 వరకు హాజరు కావలసిందిగా ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# గోదావరి పుష్కరాలకు ఏర్పాట్ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్




ములుగు జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరం గల జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయి-ంలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, వైద్యశిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో మొత్తం నాలుగు పుష్కర ఘాట్లలను మంగపేట, ముళ్ళ కట్ట, రామన్నగూడెం, అంకన్నగూడెం పుష్కర ఘాట్ లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు మరుగుదొడ్లు పార్కింగ్ విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణికి 51 ఫిర్యాదులు**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 15, ఇందిరమ్మ ఇళ్లు 07, ఉపాధి కల్పనకు 06, పెన్షన్ 07, ఇతర శాఖలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్వయంగా కలెక్టర్ తో విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బండారి మల్లమ్మ ముదిరాజ్ మృతి తీరని లోటు

**మల్లమ్మ జీవితం పలువురికి ఆదర్శం**

**మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్**



నెక్కొండ, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ఇటీవల కాలంలో వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామానికి చెందిన బండారి మల్లమ్మ ముదిరాజ్ అనారోగ్య రీత్యా అకాల మరణం చెందారు. సోమవారం మల్లమ్మ దశదినకర్మ సందర్భంగా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు మల్లమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ జాతి బిడ్డలు కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్పులో మెపా ముందుంటుందని అని,ఈ సందర్భంగా మల్లమ్మ ముదిరాజ్ కుటుంబ సభ్యులు బండారి పవన్, నితిన్ ముదిరాజు లను మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్,ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్,చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, సిరబోయిన సారంగపాణి, సోషల్ మీడియా ఇంచార్జి చెన్న బోయిన శ్రీనాథ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దండి అశోక్, సురేష్,నరేష్, దీక్షకుంట గ్రామ ముదిరాజ్ లు ఎదురబోయిన ఏకాంబరం,బండారి మల్లయ్య, చిరబోయిన కొమ్మలు, అధ్యక్షులు చిరబోయిన సాంబయ్య లతో పాటు డైరెక్టర్ లుతో పాటు బంధువులు బండారి పవన్, మంజుల, మాధవులు నితిన్, వెంకటమ్మ, సుజాత, అల్లే కొమురయ్య,పొన్నం మహేందర్, నూకల స్వామి, గంగరబోయిన నిరంజన్, మేక సుజత, ఉడుత రాజు, పులి స్వామి, అన్నబోయిన శ్రీను, మేక రాజు, విజయ,శ్రీనాథ్, సమ్మక్క, పాల్గొన్నారు.

# గెజిటెడ్ అధికారుల క్యాలెండర్ ఆవిష్కరణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రూపొందించిన 2026 సంవత్సరానికి సంబంధించిన డైరీ మరియు క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వైద్య శాఖ అధికారి ఆధ్వర్యంలో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించేందుకు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండడం ఎంత ముఖ్యమో వివరించారు. అదేవిధంగా, ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో ఎస్బిఐ ద్వారా లభించే బెనిఫిట్స్ గురించి ఎల్డీఎం సమగ్రంగా వివరించారు. సంబంధిత ఆర్థిక సదుపాయాలు, బీమా ప్రయోజనాలు మరియు ఇతర సహాయక పథకాలపై సమగ్రంగా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా 2026 డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ టీజీఓలు రూపొందించిన ఈ డైరీ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు అవసరమైన ముఖ్యమైన జి.ఓలు, జిల్లా స్థాయి అధికారుల సంప్రదింపుల వివరాలు వంటి సమాచారాన్ని డైరిలో సమగ్రంగా పొందుపరచడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచినందుకు సంఘ సభ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, టిజిఓ జిల్లా అధ్యక్షులు విజయలక్ష్మి, కార్యదర్శి సునీల్ కుమార్, సహ అధ్యక్షులు మహమ్మద్ సంధాని, కోశాధికారి అజహర్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్స్ శ్రీనివాస్, సంతోష్ కుమార్, మల్లీశ్వరి, మధుసూదన్, శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, సమ్మయ్య, జాయింట్ సెక్రటరీలు రామచందర్, ఫణిభూషణ్, స్వాతి, బాపూరావు, రాధికా రెడ్డి, సురేందర్, పబ్లిసిటీ సిటీ సెక్రటరీ గోపాలకృష్ణ మూర్తి, కల్చరల్ సెక్రటరీ ఎం. రాజేందర్, స్పోర్ట్స్ సెక్రటరీ భరత్ ఆనంద్, ఈసీ మెంబర్లు ఇందిర, మల్లయ్య, జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అన్ని విభాగాల అధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతులను ప్రాధాన్యత క్రమంలో స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా భూమి రికార్డుల సవరణ, వారసత్వ మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలి. సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు మరియు ఇతర ప్రభుత్వ పథకాల కోసం వచ్చిన అర్జీలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అన్నారు. మురుగునీటి కాలువలు, త్రాగునీరు మరియు విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన పూజరి సుశీల తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లుకు సంబంధించిన స్లాబ్ పూర్తి చేసి వేరిఫికేషన్ పూర్తయి సాంక్షన్ కాని డబ్బులను వెంటనే ఇప్పించగలరని కోరారు. ఇనుగుర్తి మండలం మీట్యాతండ కు చెందిన రైతులు తాము గత 30 సంవత్సరాల నుండి వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని అట్టి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ భూములకు పట్టాలను మంజూరు చేసి ఇవ్వాలని కోరారు. పట్టణంలోని బేతోల్ గ్రామానికి చెందిన గ్రామస్తులు గ్రామంలోప్రభుత్వ పాటశాల కు చెందిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి వేరొకరికి అమ్మారని అట్టి స్థలాన్ని విచారణ చేసి సమస్యని పరిష్కరించాలని అన్నారు. నేటి ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం ౹131౹ దరఖాస్తులను పరిష్కారానికి అధికారులకు ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్.పి సీ ఈఓ పురుషోత్తం, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు, శ్రీనివాసరావు, డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి రాథోడ్, జిల్లా వ్యవసాయ అధికారి సరిత,జిల్లా సంక్షేమ అధికారి సబిత,డి.ఎం. సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, జిల్లా ఉపాధి అధికారి రజిత, ఎల్.డి.యం యాదగిరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెండెంట్ మదన్ మోహన్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిగిలిన ఇందిరమ్మ ఇళ్లకు మార్క్ అవుట్ పూర్తి చేయాలి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): మిగిలిన ఇందిరమ్మ ఇళ్లకు తక్షణమే మార్క్ అవుట్ పూర్తి చేసి, బేస్ లెవెల్ నుండి రూఫ్ కాంక్రీట్ దశ వరకు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, పీఆర్, మున్సిపల్, ఎంపిడివోలతో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్ మరియు 2బీహెచ్‌కే గృహాల సముదాయాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4165 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, అందులో 58 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 4107 ఇళ్లలో 898 ఇళ్లు ప్రారంభ దశలో, 582 బేస్ లెవెల్ దశలో, 1092 రూఫ్ లెవెల్ దశలో, 481 రూఫ్ కాంక్రీట్ దశలో ఉండగా, 1054 ఇళ్లకు మార్క్ అవుట్ చేయాల్సి ఉందని తెలిపారు. లబ్ధిదారులను సమన్వయం చేస్తూ పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, అర్హులైన ప్రతి నిరూపేదకు గృహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. యంత్రాంగం సమన్వయంతో పని చేసి, మంజూరైన ఇళ్లన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, అన్ని మండలాల ఎంపిడివోలు, గృహా నిర్మాణ శాఖ డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లాలో (8157) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్.



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): సోమవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ 10వ తరగతి పరీక్షలు నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతోసమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2026లో పరీక్షలు నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి, హైదరాబాద్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు 14-03-2026 నుండి 16-04-2026 వరకు ఉదయం 9.30 నుండి 12.30 గంటల వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 45 కేంద్రాల్లో (8157) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఈవో రాజేశ్వర్, డీఎస్పీ తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ శ్రేయస్సు మరియు స్థితిస్థాపకత కార్యక్రమం

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరం తగ్గింపే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ ఆధునీకరణ ద్వారా వలసలను తగ్గించి, ఆర్థిక స్థిరత్వాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమం గ్రామీణ శ్రేయస్సు మరియు స్థితిస్థాపకత కార్యక్రమం గ్రామీణ సమృద్ధి మరియు స్థితిస్థాపకత కార్యక్రమం ద్వారా

గ్రామీణ ప్రాంతాల్లో విస్తారమైన అవకాశాలను సృష్టించి తద్వారా వలసలను తగ్గించడం, గ్రామీణ మహిళలు, యువ రైతులు, గ్రామీణ యువత, సన్నకారు, చిన్న రైతులు, భూమిలేని కుటుంబాలపై దృష్టి పెట్టడం,మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం అందించడం తదితర కార్యక్రమాలను చేపట్టి పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అభివృద్ధి అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం కాగాఎమొదటి దశలో 5 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగ అందులో దక్షిణ భారత దేశం నుండి కేవలం జనగాం జిల్లా ఎంపిక కావడం విశేషం ఈ నేపథ్యంలో కేంద్రం నుండి ఎషియాన్ డెవలప్మెంట్ బ్యాంకు, బోష్టన్ కన్సల్టేన్సీ ప్రతినిధులు సోమవారం జిల్లా లో ఉన్న స్థితి గతులను అధ్యయనం చేసేందుకు విచ్చేసారు. ముందుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లుమ్, పరిశ్రమలు, డిఆర్డీఏ తదితర శాఖలకు సంబందించిన అధికారులతో కలెక్టరెట్ లోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో సమావేశమయ్యారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముందుగా జిల్లా ఆవిర్భావం, భౌగోళిక పరిస్థితులు అలాగే వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న కేంద్ర, రాష్ట్ర పథకాల పురోగతి గురించి ప్రతినిధులకు వివరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా తమ పరిధిలో కేంద్ర, రాష్ట్ర పథకాలని ఏవిధం గా అమలు చేస్తున్నారనే అంశాలను తెలపగ..ఇంకా పురోగతి కి కావలిసిన సహకారాలను ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 5 రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన కేంద్ర బృందం క్షేత్ర స్థాయి పరిశీలనలు చేసి జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పథకాల ను అవగతం చేసుకొని మరింత పురోగతి కి కావలిసిన సలహా, సూచనలను తెలియజేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఎషియాన్ డెవలప్మెంట్ బ్యాంకు , బోష్టన్ ప్రతినిధులు సునయ్ కీమ్ (ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు) అపర్ణ, హర్షద్, ఆనంద్, అంకిత్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ గారి చిత్రపటానికి పూల మాల వేసిన కుంజా సూర్య



మంగపేట, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్):" సోమవారం రోజున మంగపేట మండలం చేరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ చిన్నాన్న సత్యనారాయణ ఇటీవల కాలం నుండి బాధ పడుతూ స్వర్గస్థులు అవ్వగా ఈరోజు అయన దశ దిన కర్మలకు హాజరై వారి చిత్రపరనికి పూలమాల వేసి అయన మృతి పట్ల అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారి కుమారుడు నియోజకవర్గ యువ నాయకులు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ కుంజా సూర్య ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డితో పాటుగా జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

## హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను అధికారులు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఇతర అధికారులతో కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు 165 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని పి ఐ ఓ లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి సంబంధించిన దరఖాస్తులు కూడా పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిద్ర మాను వృక్షాల నరికివేతపై అటవీ శాఖ స్పందించాలి

## జిల్లా ఫారెస్ట్ ఏవో కె.యస్. ఎన్ మూర్తి కి ఫిర్యాదు

మణుగూరు, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): మణుగూరు ఏరియాలో నిద్రమాను వృక్షాల నరికివేత పై అటవీ శాఖ స్పందించాలని కోరుతూ సోమవారం నాడు జిల్లా ఫారెస్ట్ ఏవో కె ఎస్ ఎన్ మూర్తికి ఫిర్యాదు చేసినట్లు మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు ఏరియా సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సుమారు యాభై సంవత్సరాలు వయసున్న సింగరేణి ప్రారంభ దశలో నాటిన నిద్రమాను వృక్షాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నరకించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని. కాండం మరియు కొమ్మలు మాయం చేశారనీ ఆయన ఆరోపించారు. వీటి మీద విచారణ చేసి హరిత చట్టం ప్రకారం వారి మీద తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అటవీ శాఖ స్పందించకపోతే గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు అంతేకాకుండా పీవీ కాలనీలో అనుమతి లేకుండా నరికించిన ఇతర వృక్షాలపై కూడా విచారణ జరిపించి చెట్లను నక్కకుండా పర్యావరణ పరిరక్షణ తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# గోదావరి పుష్కరాలకు ఏర్పాట్ల ప్రతిపాదనలు సమర్పించాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుష్కరాల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై పూర్తి స్థాయి ప్రణాళికతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. పుష్కర స్నానానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్యం, శుద్ధి చేసిన త్రాగునీటి సరఫరా, తాత్కాలిక వైద్య శిబిరాల ఏర్పాటు, అంబులెన్స్ సదుపాయం, గజ ఈతగాళ్ల నియామకం, బలమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ మరియు వెలుగుల ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ముఖ్యంగా భద్రాచలంలో గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. భద్రాచలం గోదావరి తీరం వద్ద ఉన్న పుష్కర ఘాట్లను పరిశీలించి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భద్రాచలం గోదావరి తీరంలో పుష్కర స్నానానికి సమీప జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం మరియు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని, అందుకు అనుగుణంగా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో దామోదర్ రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


# జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా టాలెంట్ టెస్ట్ నిర్వహణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆనంద ఖని పాఠశాల నందు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ పోటీలలో సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో 9వ తరగతి చదువుతున్న కే. వరుణ్ సాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జగన్నాధపురం విద్యార్థి, ప్రథమ బహుమతిని సాధించారు. ఈ విద్యార్థికి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని బి. దుర్గా శైలజ గైడ్ టీచర్‌గా మార్గనిర్దేశనం చేశారు. ద్వితీయ బహుమతిని బి. ధనుష్, ఉన్నత పాఠశాల ఆనందఖని విద్యార్థి, తృతీయ బహుమతిని షేక్ నజీమా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భద్రాచలం విద్యార్థిని సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ, నిత్య జీవితంలో సైన్స్‌ను అన్వయించుకుంటూ జీవన విధానంలో భాగంగా మార్చుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సంపత్ కుమార్, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు నాగరాజ్ శేఖర్, సైదులు, సతీష్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అమీరుద్దీన్, యశోద, అనురాధ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఊరట

మొదటి పేజీ తరువాయి



ఇచ్చిన హామీల ప్రకారం, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇళ్ల స్థలం, నెలకు సుమారు ₹25,000 పెన్షన్, అలాగే ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించాలని ప్రకటించింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఈ హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ పలువురు ఉద్యమకారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ నిర్వహించిన ధర్మాసనం ప్రభుత్వానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టులో జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. కోర్టు ప్రభుత్వాన్ని 8 వారాల్లోగా అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు, అలాగే ఎన్నికల హామీ మేరకు నెలవారీ పెన్షన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హామీలు అమలు చేయడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందో వివరించాలని, కొందరికి మాత్రమే ప్రయోజనాలు ఇచ్చినట్లయితే దాని ప్రమాణాలు ఏమిటో తెలియజేయాలని కూడా కోర్టు సూచించింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుంది అని కోర్టు స్పష్టం చేసింది.

# 10వ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించిన కలెక్టర్



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పదవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హితవు పలికారు. సోమవారం సాయంత్రం వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ అరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మిక సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు భోదిస్తున్న ప్రత్యేక తరగతులు, అందిస్తున్న స్నాక్స్ ను పరిశీలించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహనా కల్పించారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పది సంవత్సరాల తరువాత ఎటువంటి ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో, ఆ ఆలోచనకు ఇప్పుడే అంకురార్పణ చేసేసుకోవాలని అన్నారు. జీవితంలో నిలదొక్కుకొనేందుకు పదవ తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ అని అన్నారు. ప్రణాళిక బద్ధంగా చదవి ఉత్తమ ఫలితాలు సాదించాలని సూచించారు . విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదల తో బాగా చదివి ఉన్నత స్థానాలలో నిలబడి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. కష్టపడుతూ ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఏర్పడే భయాందోళనలను తొలగించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రధానంగా నాలుగు రకాల భయాలు ఉంటాయని -- తల్లిదండ్రుల పట్ల భయం, ఉపాధ్యాయుల పట్ల భయం, చదువు పట్ల భయం, భవిష్యత్ పట్ల భయం -- ఇవన్నీ వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించడానికి "స్ఫూర్తి" కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని దత్తత తీసుకున్నట్టు భావించి వారికి వ్యక్తిగతంగా మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారిలో నమ్మకం పెంపొందించి, సానుకూల దృక్పథాన్ని కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక దశ పదో తరగతి అని, ఈ దశలో సరైన మార్గదర్శకం అవసరమని చెప్పారు. అదేవిధంగా, ప్రతి రోజు ఉదయం "వేకప్ కాల్" ద్వారా విద్యార్థులను నిద్రలేపి చదువుపై దృష్టి కేంద్రీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి పై దృష్టి సారించి వారు ఉన్నత మార్కులు సాధించే దిశగా సన్నాహాలు చేయాలని ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రంగయ్య నాయుడు, ఎం ఈ ఓ ప్రసాద్, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**




వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్):" ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికైన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షత వహించగా, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డిఎంహెచ్వో డా. సాంబశివరావు, హౌసింగ్ పీడీ శ్రీవాణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్, ప్రతి దరఖాస్తును స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే సంబంధిత శాఖాధికారులతో చర్చించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిష్కారం సాధ్యంకాని దరఖాస్తుల విషయంలో సంబంధిత అభ్యర్థులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సూచించారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యతాయుత వ్యవహారం ఉండాలని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 150 దరఖాస్తులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించినవి 38, ఇతర శాఖలకు సంబంధించినవి 56 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు అధికంగా ఉన్నందున, వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేస్తూ నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.

వృద్ధులు, సామాజిక సంక్షేమం, పింఛన్లు వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమం మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు పంపిస్తూ, మానవీయ దృక్పథంతో త్వరిత పరిష్కారం కల్పించాలని సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లాలో కొనసాగుతున్న "స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ మ్యాపింగ్" కార్యక్రమంపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. భూసంబంధిత రికార్డుల ఖచ్చితత్వం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డి సి ఓ నీరజ, డిబిసిడిఓ పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

**పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**మొత్తం 78 దరఖాస్తులు స్వీకరణ**

**జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్**



జనగామ జిల్లా, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందచేసిన ఆర్జీలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న తో కలిసి అదనపు కలెక్టర్ ప్రజల వద్ద నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసి, దరఖాస్తులను పరిశీలించి , త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తుల పై సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసి అందజేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు, పెండింగ్లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులలో ఏమైనా పెండింగ్ లో ఉంటే సత్వరమే పరిష్కరించి, అట్టి వివరాలను సంబంధిత వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 78 ఆర్జీలు స్వీకరించామని ఆయన తెలిపారు. ఈ ప్రజావాణిలో జిల్లా పరిపాలన అధికారి సిహెచ్. శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్‌గా హైదరాబాద్

## మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరో స్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్‌ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అందుకోసం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను రెడీ టూ వర్క్ ఫోర్స్ గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సోమవారం నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్ట్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజినీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఏఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు.

### తెలంగాణే గమ్యస్థానంగా

నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్ సీఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్‌పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్'గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

# కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై "బీసీ కమిషన్ సీరియస్"


## సుమోటోగా విచారణకు ఆదేశం

## పసికందు మృతి, ఆలయ ప్రవేశంపై కమిషన్ ఆగ్రహం




హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న రెండు నెలల పసికందు మృతి, బీసీ వర్గాలకు ఆలయ ప్రవేశం నిరాకరించారన్న ఆరోపణల ఘటనపై తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా స్పందించిన కమిషన్ ఈ అమానవీయ ఘటనపై తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపి, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో పాటు, దేవాదాయ శాఖ (ఎండోమెంట్) కమిషనర్ కు బీసీ కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం




తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. అందులో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,89,126 మంది, సెకండియర్ విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారు. ఇందుకోసం స్టేట్ వైడ్‌గా 1,495 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రైవేటు కాలేజీలతో పాటు 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలు కూడా ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 28,500 మంది ఇన్విజిలేటర్లు, 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 200 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే, అంటే ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులు వెబ్‌సైట్ (స్త్రఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ) నుంచి లేదా కళాశాలల నుండి హాల్ టికెట్లు పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్లను అనుమతించాలని బోర్డు ఆదేశించింది.

### 7,500 సీసీ కెమెరాలతో నిఘా

ఇక సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పరీక్షా హాల్లోకి అనుమతించరు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. విద్యార్థుల కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఫర్నిచర్, గోడ గడియారాలు వైద్య సహాయం అందుబాటులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కోసం సుమారు 7,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని టీజీబీఐఈ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు. అలాగే పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.

### మానసిక ఒత్తిడి నివారణకు 'టెలి-మానస్'

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురైతే నిపుణులైన సైకాలజిస్టుల సలహాల కోసం 14416 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని బోర్డు సూచించింది. ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి.

# మహిళా భద్రతపై మంత్రి సీతక్క సమీక్ష

## సమగ్ర కార్యాచరణకు ఆదేశం

## సమాన అవకాశాలే లక్ష్యం



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): మహిళల అభివృద్ధి, సాధికారత, సమాన అవకాశాలు, భద్రత అంశాలపై పలు కీలక శాఖలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళల సమగ్ర సంక్షేమం కోసం శాఖల మధ్య సమన్వయం పెంపొందిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించి, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలోనే లింగ సమానత్వ భావనను బలపరిచే విధంగా పాఠ్యాంశాలలో మార్పులు చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. ఉద్యోగ రంగంలో మహిళలకు సమాన హక్కులు, ప్రైవేటు రంగంలోనూ మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ అమలు వంటి అంశాలపై విధానపరమైన మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు.

### మహిళా భద్రతపై విస్తృత చర్చ

ఈ సమావేశంలో మహిళా భద్రత అంశంపై విస్తృత చర్చ జరిగింది. మహిళా, శిశు సంక్షేమ, పోలీస్ శాఖల సమన్వయంతో మహిళా భద్రత విషయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, డేటింగ్ యాప్స్ మరియు మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. సమావేశంలో వెలువడిన సూచనల అమలుకు అంశాల వారీగా సబ్ కమిటీలు ఏర్పాటు చేసి, తక్షణమే కార్యాచరణ బృందాలను నియమించాలని మంత్రి శ్రీమతి సీతక్క స్పష్టం చేశారు. మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది. మహిళలకు భద్రత, సమాన అవకాశాలు, ఆరోగ్యం, గౌరవప్రద జీవనం కల్పించడం ప్రభుత్వ ధర్మం. ఈ సమావేశంలో వచ్చిన ప్రతి సూచనను కార్యాచరణ ప్రణాళికగా మార్చి వేగవంతంగా అమలు చేస్తాం అని పేర్కొన్నారు

# వైద్య విధాన పరిషత్ పేరు మార్పు

## మే 11 నుండి జనగణన

## కీలక నిర్ణయాలు తీసుకున్న తెలంగాణ కేబినెట్



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరు మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా నామకరణం చేశారు. దీంతో ఇకపై టీవీవీపీ ఉద్యోగులంతా ప్రభుత్వ పరిధిలోకి రాబోతున్నారు. దీంతో పాటు రైతు భరోసా నిధుల విడుదల, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీల ఖరారు మరియు తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జన గణన ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్) అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమరేటర్లను, వారికి దిశానిర్దేశం చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన ప్రక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## అభిషేక్ శర్మపై వేటు?

### సంజూ శాంసన్‌ను జట్టులోకి..

దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్-8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన తర్వాత టీమిండియా యాజమాన్యం మేల్కొంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ పరాజయం మాత్రమే కాదు.. భారత్ సెమీఫైనల్ ఆశలను కూడా దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో జింబాబ్వే, వెస్టిండీస్‌తో జరగబోయే కీలక మ్యాచ్‌ల కోసం ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు చేసేందుకు గౌతమ్ గంభీర్ సేన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కడుపు ఇన్ఫెక్షన్ నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన అభిషేక్ శర్మ.. పాకిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌ల్లో కనీసం ఖాతా తెరవలేకపోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక పోరులోనూ కేవలం 15 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. దీంతో అభిషేక్ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది.ప్రస్తుతం భారత టాపార్డర్ అంతా ఎడమచేతి వాటం బ్యాటర్లతోనే (అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ) నిండిపోయింది. ఇది ప్రత్యర్థి జట్ల స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ ఏకపక్ష బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాలని కోచింగ్ స్టాఫ్ భావిస్తోంది. సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోష్చేట్ మాట్లాడుతూ.. "సంజూ శాంసన్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిని టాపార్డర్‌లో చేర్చడం వల్ల వ్యూహాత్మకంగా రైట్ హ్యాండ్ - లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ సెట్ అవుతుంది. జట్టులో మార్పుల గురించి రాబోయే రెండు రోజుల్లో చర్చిస్తాం" అని పేర్కొన్నారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. తిలక్ వర్మ, రింకూ సింగ్ ప్రదర్శనలపై కూడా మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో కనీసం ఒకరిని పక్కన పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. భారీ హిట్టర్‌గా పేరున్న రింకూ సింగ్ దక్షిణాఫ్రికాపై డకౌట్ అవ్వడం టీమిండియా మిడిలార్డర్ బలహీనతను బయటపెట్టింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లను జింబాబ్వే, వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంది. సెమీస్ చేరాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవడమే కాకుండా, నెట్ రన్ రేట్‌ను కూడా భారీగా మెరుగుపరుచుకోవాలి. ఈ క్రమంలో గంభీర్ మార్క్ 'అగ్రెసివ్' నిర్ణయాలు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండబోతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## టీమిండియా ఓటమికి ఆ రెండు తప్పిదాలే కారణం..

### టీమిండియాపై మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ఫైర్

దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 పోరులో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి భారత సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చడమే కాకుండా, జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. అశ్విన్ తన విశ్లేషణలో ప్రధానంగా అక్షర్ పటేల్‌ను జట్టు నుండి తొలగించడం, రింకూ సింగ్‌ను 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపడం అనేవి జట్టు సమతూకాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు.జట్టు యాజమాన్యం మ్యాచ్-అప్‌ల పేరుతో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడాన్ని అశ్విన్ తప్పుబట్టారు. ఐపీఎల్ వంటి సుదీర్ఘ టోర్నీలలో మ్యాచ్-అప్‌లు పని చేస్తాయని, కానీ ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో జట్టు స్థిరత్వం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 క్రికెట్‌లో అక్షర్ పటేల్ టీమ్ ఇండియాకు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'అని, గత ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై ఒత్తిడిలో ఆయన అద్భుత ప్రదర్శన చేశారని అశ్విన్ గుర్తు చేశారు.సమతూకం దెబ్బతింది: అక్షర్ లేకపోవడం వల్ల మిడిల్ ఓవర్లలో జట్టుకు ఉండాల్సిన ఎడమచేతి వాటం బ్యాటింగ్ బలం తగ్గిందని, ఇది దక్షిణాఫ్రికా స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించేలా చేసిందని ఆయన విశ్లేషించారు. మరో ముఖ్యమైన తప్పిదం రింకూ సింగ్‌ను 8వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం అని అశ్విన్ అన్నారు. ఫినిషర్‌గా పేరున్న రింకూకు తగినన్ని ఓవర్లు లభించకపోవడం వల్ల భారత బ్యాటింగ్ భారీ స్కోరును సాధించలేకపోయిందని లేదా లక్ష్య ఛేదనలో వెనుకబడిందని ఆయన పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరంతరం మార్పులు చేయడం వల్ల ఆటగాళ్ళలో అభద్రతాభావం ఏర్పడుతుందని, అది వారి సహజ సిద్ధమైన ఆటను దెబ్బతీస్తుందని అశ్విన్ హెచ్చరించారు.బ్యాటర్ల టెక్నిక్ గురించి కూడా అశ్విన్ ఘాటుగా స్పందించారు. భారత బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. డిఫెన్స్ లేకపోవడం: భారత బ్యాటర్లు తమ డిఫెన్స్‌పై నమ్మకం ఉంచకుండా కేవలం భారీ షాట్లపైనే ఆధారపడుతున్నారని, ఇది తిరిగే పిచ్‌లపై ప్రమాదకరమని అన్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్లు వికెట్లు తీస్తుంటే మన బ్యాటర్లు స్వీప్ లేదా రివర్స్ స్వీప్ షాట్లను ఆడలేకపోయారని, ఇది వారి సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతోందని విమర్శించారు. మొత్తంగా, దక్షిణాఫ్రికా జట్టు సరైన ప్రణాళికలతో వచ్చి భారత్‌ను చిత్తు చేసిందని, టీమ్ ఇండియా మాత్రం వ్యూహాత్మక గందరగోళంతో ఓటమిని కొనితెచ్చుకుందని అశ్విన్ తన రివ్యూలో కుండబద్దలు కొట్టారు.

# టీమిండియా సెమీ-ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం



టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌కు అనూహ్యమైన భారీ షాక్ తగిలింది. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా 76 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయం భారత జట్టు సెమీ-ఫైనల్ అవకాశాలను తీవ్రంగా సంక్లిష్టం చేసింది. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, భారీ తేడాతో ఓడిపోవడంతో భారత జట్టు నెట్ రన్ రేట్ఘోరంగా దెబ్బతింది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ -3.800గా నమోదైంది. ఇది సెమీస్ రేసులో భారత్‌కు తీవ్ర ప్రతికూలంగా మారింది. టీమిండియా సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే, మిగిలి ఉన్న రెండు సూపర్ 8 మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధించడం తప్పనిసరి. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లలో వెస్టిండీస్, జింబాబ్వే జట్లతో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలో విజయాలు సాధించడం ద్వారా భారత్ ఖాతాలో నాలుగు పాయింట్లు వచ్చి చేరతాయి. అయితే, కేవలం విజయాలు మాత్రమే సరిపోవు. నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకోవడం అత్యవసరం, ఎందుకంటే గ్రూప్‌లో ఇతర జట్లు కూడా నాలుగు పాయింట్లతో ముగించే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులలో, మెరుగైన నెట్ రన్ రేట్ కలిగిన జట్టే సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుంది. ఈ మ్యాచ్ ఓడిపోవడంతో భారత్ పూర్తిగా ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ భారత్ మిగిలిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించినా, మరో రెండు జట్లు కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధిస్తే భారత్ సెమీస్‌కు చేరుకుంటుంది. అయితే, ఒకవేళ మరో రెండు జట్లు కూడా నాలుగు పాయింట్లతో ఉంటే, అప్పుడు టీమిండియాకు సెమీస్ చేరడం కష్టమవుతుంది. ఈ సంక్లిష్ట పరిస్థితులలో టీమిండియా తన నెట్ రన్ రేట్‌ను సాధ్యమైనంత మేరకు మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించాలి. సెమీ-ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే టీమిండియాకు కొన్ని నిర్దిష్ట పరిస్థితులు అనుకూలించాలి. ఉదాహరణకు, భారత్ మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఒకటి మాత్రమే గెలిస్తే, అప్పుడు దక్షిణాఫ్రికా తమ మిగిలిన అన్ని మ్యాచ్‌లలోనూ గెలవాల్సి ఉంటుంది. అంతేకాకుండా, వెస్ట్ ఇండీస్ వర్సెస్ జింబాబ్వే మధ్య జరిగిన మ్యాచ్ విజేతను టీమిండియా ఓడించాల్సి ఉంటుంది. అలాంటి సందర్భంలో, భారత్, వెస్ట్ ఇండీస్, జింబాబ్వే జట్లు తలా రెండు పాయింట్లతో ఉంటాయి. ఈ స్థితిలో, మెరుగైన నెట్ రన్ రేట్ కలిగిన జట్టు ముందంజ వేస్తుంది. ఇది టీమిండియాకు మరింత ఒత్తిడిని పెంచుతుంది. భారత జట్టు తమ తదుపరి మ్యాచ్ ఈ నెల 26వ తేదీన జింబాబ్వేతో చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియం వేదికగా తలపడనుంది.

ఆ తరువాత, మార్చి ఒకటవ తేదీన వెస్ట్ ఇండీస్‌తో కోల్‌కత్తాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా టీమిండియా తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలో భారత జట్టు కేవలం గెలవడమే కాకుండా, భారీ మార్జిన్‌తో విజయాలు సాధించడం, తద్వారా తమ నెట్ రన్ రేట్‌ను గణనీయంగా పెంచుకోవడం అత్యంత కీలకం. ఈ భారీ ఓటమి సెమీస్ ఆశలపై మరింత క్లిష్టం చేసుకుందని చెప్పడంలో సందేహం లేదు.

## టీమ్ఇండియా అత్యంత చెత్త ఓటములు ఇవే..


డిఫెండింగ్ ఛాంపియన్?గా టీ20 వరల్డ్?కప్? బరిలో దిగిన టీమ్ఇండియాకు సూపర్ 8 తొలి మ్యాచ్?లోనే షాక్ తగిలింది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్?లో భారత్ ఘోర ఓటమి చవిచూసింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాటుతో పూర్తిగా విఫలమైన టీమ్ఇండియా కీలక పోరులో 76 పరుగుల తేడాతో ఓడి సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్?ల్లోనూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ టోర్నీలో గ్రూప్ దశలో ఓటమి లేకుండానే టీమ్ఇండియా సూపర్ 8కు దూసుకొచ్చింది. వరుసగా యూఎస్?ఏ, నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్?పై విజయం సాధించింది. దీంతో ఇక్కడ కూడా భారత్ అదే ఫలితాలు రిపీట్ చేయాలని అభిమానులు భావించారు. కానీ, సూపర్ 8 మొదటి మ్యాచ్?లోనే గట్టి ఎదురుదెబ్బ తగలడంతో నిరాశ చెందారు. వరల్డ్? ఛాంపియన్ జట్టు ఘోర ఓటమిపాలవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకొని వరుస విజయాలు సాధించి సెమీస్?కు చేరాలని ఆశిస్తున్నారు. టీమ్ఇండియా సూపర్ కమ్?బ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్నారు. అయితే గతంలోనూ టీ20 వరల్డ్?కప్?లో భారత్ భారీ పరాజయాలు మూటగట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆయా మ్యాచ్?ల్లో ఓటమిపాలై ఆ తర్వాత పుంజుకున్న సందర్భాలూ ఉన్నాయి. టీమ్ఇండియా 2016 టీ20 వరల్డ్?కప్?ను ఊహించని ఓటమితో ఆరంభించింది. ఆ ఎడిషన్?లో తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను భారత్ ఢీ కొట్టింది. తొలుత బౌలింగ్ చేసిన టీమ్ఇండియా కివీస్?ను 126-7 స్కోరుకే పరిమితం చేసింది. దీంతో భారత్ అలవోకగా గెలిచేస్తుందని ఫ్యాన్స్ అనుకున్నారు. కానీ, అనుకున్నట్లు ఛేదన జరగలేదు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అందుకోలేదు. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటై ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ధోని (30), విరాట్ (23), అశ్విన్ (10) ముగ్గురే రెండంకెల స్కోర్ చేశారు. పొట్టి కప్పులో భారత్?కు ఇది అత్యంత ఘోర ఓటమి. అయితే ఆ తర్వాత టీమ్ఇండియా కమ్?బ్యాక్ ఇచ్చింది. అదిరే ఆటతో సెమీఫైనల్?కు దూసుకెళ్లింది. కానీ అక్కడ వెస్టిండీస్?తో ఓడింది.2014 ఎడిషన్?లో భారత్ తమ మూడో మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఆడింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కష్టాలు పడుతూ 20 ఓవర్లలో 140-7 స్కోర్ చేసింది. ఇర్ఫాన్ (31), రైనా (26) టాప్ స్కోరర్లు. అయితే పిచ్ బ్యాటింగ్?కు కఠినంగా ఉందని అంతా భావించారు. కానీ, ఛేదనలో సీన్ రివర్స్ అయ్యింది. తొలుత పరుగులు చేసేందుకు టీమ్ఇండియా అష్టకష్టాలు పడ్డ అదే పిచ్?పై ఆసీస్ బ్యాటర్లు చెలరేగిపోయి ఆడడం గమనార్హం. ఒకే వికెట్ కోల్పోయి 14.5 ఓవర్లలోనే ఈ టార్గెట్?ను ఛేదించి గ్రాండ్ విక్టరీ కొట్టింది.2022 ఎడిషన్?లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ఇండియా సెమీఫైనల్?లో అడుగుపెట్టింది. అక్కడ ఇంగ్లాండ్?ను ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్?లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 168-6 స్కోర్ చేసింది. హార్దిక్ పాండ్య, విరాట్ కోహ్లీ చెరో హాఫ్ సెంచరీ సాధించారు. కానీ ఛేజింగ్?లో ఇంగ్లాండ్ జెట్ స్పీడ్?తో రెచ్చిపోయింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 16 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఈ టార్గెట్?ను ఛేదించేసింది. ఓపెనర్లు బట్లర్ (80), అలెక్స్ హేల్స్ (86) చెలరేగి ఆడారు. వీళ్ల బ్యాటింగ్?కు టీమ్ఇండియా బౌలర్లు కళ్లెం వేయలేకపోయారు వన్?సైడ్?గా సాగిపోయిన ఈ మ్యాచ్?లో భారత్ అసలు పోటీ కూడా ఇవ్వలేకపోయింది. పొట్టి కప్పు హిస్టరీలో భారత్?కు ఇదే అత్యంత ఘోర ఓటమి అని చెప్పవచ్చు!ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్?పై అప్పటిదాకా ఘనమైన రికార్డ్ ఉంది. 100శాతం విజయాలతో టీమ్ఇండియా ట్రాక్ రికార్డ్ ఘనంగా ఉంది. కానీ, 2021లో భారత్ తొలిసారి టీ20 వరల్డ్?కప్?లో పాక్?పై ఓటమి చవిచూసింది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 152 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ టార్గెట్?ను పాక్ ఓపెనర్లు మహ్మద్ రిజ్వాన్ (79), బాబర్ అజామ్ (68) 17.5 ఓవర్లలోనే కొట్టేశారు. ఈ మ్యాచ్? ఓటమి టీమ్ఇండియా అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. అలా 2021,2022 వరుస ఎడిషన్లలో పాక్, ఇంగ్లాండ్?పై భారత్ ఓటములు అభిమానులను బాధించాయి. కానీ ఆ తర్వాత పాక్?తో జరిగిన అన్ని ఐసీసీ ఈవెంట్లో (ప్రస్తుత వరల్డ్?కప్? సహా)నూ భారత్ ఘన విజయం సాధించింది.

## వాంఖడేలో హెట్‌మైయర్ ఊచకత..



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్--8 దశలో వెస్టిండీస్ జం జింబాబ్వే మధ్య జరుగుతున్న కీలక మ్యాచ్ క్రికెట్ అభిమానులను ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైయర్ కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసి స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ స్కోర్ బోర్డు వేగంగా దూసుకెళ్తోంది. టాస్ గెలిచిన జింబాబ్వే ముందుగా బౌలింగ్ ఎంచుకోగా, వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. పవర్‌ప్లేలో కొంత ఒత్తిడి ఎదురైనా, మిడిల్ ఓవర్లలో హెట్‌మైయర్ క్రీజ్‌లోకి దిగిన వెంటనే మ్యాచ్ సీన్ పూర్తిగా మారిపోయింది. స్పిన్నర్లపై దూకుడుగా, పేసర్లపై పవర్ ఫుల్ షాట్లతో అతడు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం ఈ వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తరఫున వేగవంతమైన అర్ధశతకాలలో ఒకటిగా నిలిచింది. హెట్‌మైయర్ 5 వరుస సిక్సర్లు, 5 ఫోర్లు బాదడంతో జింబాబ్వే బౌలర్లపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. మరో వైపు బ్యాటింగ్ చేసిన సహచరులు కూడా స్థిరంగా నిలబడి భాగస్వామ్యాన్ని నిర్మించడంతో వెస్టిండీస్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లింది. డెత్ ఓవర్లలో మరింత దూకుడు చూపితే వెస్టిండీస్ 180ం స్కోర్ దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జింబాబ్వే బౌలర్లు పవర్‌ప్లేలో చూపిన క్రమశిక్షణను మిడిల్ ఓవర్లలో కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా హెట్‌మైయర్ వేగంగా పరుగులు చేయడంతో మ్యాచ్‌పై వెస్టిండీస్ పట్టు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటింగ్ ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది.

## చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్, మహికా సందడి.



టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతున్న తరుణంలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మైదానంలో కంటే మైదానం బయటే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాడు. హార్దిక్ పాండ్యా తన కొత్త గర్ల్‌ఫ్రెండ్, నటి మహికి శర్మతో రిలేషన్‌లో ఉన్నాడనే వార్తలు ఇప్పుడు అధికారికంగా ధ్రువీకరించబడినట్లు కనిపిస్తోంది. టోర్నీ ప్రారంభం నుంచి టీమిండియా ఎక్కడికి వెళ్తే మహికి అక్కడే ప్రత్యక్షమవుతోంది. తాజాగా భారత జట్టు తన తదుపరి మ్యాచ్ కోసం చెన్నై చేరుకోగా, ఎయిర్‌పోర్ట్‌లో హార్దిక్ తన ప్రియురాలి భుజంపై చేయి వేసి నడుస్తున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో వీరిద్దరి ప్రేమాయణం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వ్యక్తిగత జీవితం సంగతి పక్కన పెడితే, హార్దిక్ పాండ్యా ఆటతీరుపై మాత్రం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన సీనియర్ ప్లేయర్, మైదానంలో మాత్రం చేతులెత్తేస్తున్నాడనే ఆగ్రహం అభిమానుల్లో కనిపిస్తోంది. గ్రూప్ స్టేజ్‌లో నమీబియా వంటి చిన్న జట్టుపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన హార్దిక్, అసలైన సూపర్ 8 పోరులో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాతో జరిగిన కీలక మ్యాచ్‌లో బౌలింగ్‌లో 4 ఓవర్లలో ఏకంగా 45 పరుగులు సమర్పించుకోవడమే కాకుండా, బ్యాటింగ్‌లో కూడా 17 బంతుల్లో కేవలం 18 పరుగులు మాత్రమే చేసి ఒత్తిడిలో నిలబడలేకపోయాడు. హార్దిక్ పాండ్యా తన ప్రియురాలి పుట్టినరోజు వేడుకలను కూడా అహ్మదాబాద్‌లోని టీమ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించాడు. జట్టులోని ఇతర సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, అభిమానుల ప్రశ్న మాత్రం ఒక్కటే.. రొమాన్స్ ఓకే.. కానీ టీమిండియాను ఎప్పుడు గెలిపిస్తావు హార్దిక్?. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన పాండ్యా, ఇప్పటివరకు పెద్ద జట్లపై తన మార్కు చూపించలేకపోయాడు. బౌలింగ్‌లో పరుగులు నియంత్రించలేకపోవడం, బ్యాటింగ్‌లో స్ట్రైక్ రేట్ మందగించడం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది.తదుపరి మ్యాచ్ జింబాబ్వేతో చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటికే మహికా శర్మ చెన్నై చేరుకోవడంతో, ఈ మ్యాచ్‌లోనైనా హార్దిక్ బ్యాట్‌తో లేదా బంతితో విన్యాసాలు చేస్తాడో లేదో చూడాలి. ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా తన ప్రధాన బాధ్యత దేశాన్ని గెలిపించడమేనని హార్దిక్ గుర్తించాలని మాజీ క్రికెటర్లు సైతం సూచిస్తున్నారు. మరి జింబాబ్వేపై అయినా ఈ స్టార్ ప్లేయర్ తన పాత ఫామ్ అందుకుని విమర్శకుల నోళ్లు మూయిస్తాడో లేదో వేచి చూడాలి.

# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం



అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మ- రోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ్' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తిగా చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.

# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.





# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47

టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం.ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చవ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్-వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి.ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.



# సమంత స్పెషల్ ఫోజ్.. తడి అందాలతో ఉక్కిరిబిక్కిరి!

ఎంత కష్టం ఎదురైనా సరే ఓపికగా ఆ కష్టాన్ని భరిస్తూ.. ఒక్కో మెట్టు ఎదుగుతూ నేడు పాన్ ఇండియా స్టార్ గా చలామణి అవుతోంది ప్రముఖ స్టార్ హీరోయిన్ సమంత. 'ఏ మాయ చేసావే' అనే సినిమాతో తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ చెన్నై చిన్నది.. మొదటి సినిమాతోనే కుర్రకారు హృదయాలను దోచుకుంది. ఇందులో తన అద్భుతమైన నటనతో సింపుల్ లుక్ లో ఆడియన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేసేసింది. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న సమంత.. ఆ తర్వాత వరుస పెట్టి స్టార్ హీరోలుగా పేరు దక్కించుకున్న పవన్ కళ్యాణ్ , రామ్ చరణ్ , అల్లు అర్జున్, ఎన్టీఆర్ వంటి హీరోలతో సినిమాలు చేస్తూ వచ్చి మంచి పేరు దక్కించుకుంది. కెరియర్ పీక్స్ లో ఉండగానే అక్కినేని హీరో నాగచైతన్యతో ఏడడుగులు వేసింది.. ఏడేళ్ల రహస్య ప్రేమాయణం తర్వాత ఎట్టకేలకు క్యాథలిక్ పద్ధతిలో ఒకసారి..హిందూ పద్ధతిలో మరోసారి రెండుసార్లు వివాహం చేసుకొని.. కొత్త బంధాన్ని ప్రారంభించారు. అయితే ఆ తర్వాత కాలంలో ఏమైందో తెలియదు కానీ పెళ్లైన నాలుగేళ్లకే విడాకులు ప్రకటించి అందరిని ఆశ్చర్యపరిచారు . ఆ సమయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. వ్యక్తిగతంగా ఇబ్బందులు పడింది. పైగా మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడి చికిత్స కోసం అమెరికా వెళ్లి అక్కడే కొంతకాలం గడిపింది కూడా. ఇక సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఈమె తెలుగులో యశోద, శాకుంతలం, ఖుషీ వంటి చిత్రాలు చేసింది. కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ బాలీవుడ్ లో సిటాడెల్: హనీ బన్నీ అనే వెబ్ సిరీస్ చేసి తన యాక్షన్ పర్ఫామెన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇకపోతే ఒకవైపు ఈ సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరోకవైపు ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీ వోగ్ ఇండియా కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. ఇందులో నైటీను తలపించేలా డ్రెస్ ధరించి తడి అందాలతో స్పెషల్ ఫోజులు ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఒకవైపు ఇలా తడి అందాలతో ఆకట్టుకుంటూనే మరోకవైపు రెడ్ కలర్ ఫ్రాక్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. ఇకపోతే వోగ్ ఇండియా కి ఇచ్చిన ఇంటర్వ్యూలో" వ్యాపారాలలో పెట్టుబడి పెట్టిన విషయం నిజమే కానీ.. నటనకే నా మొదటి ప్రాధాన్యత" అంటూ నటనపై తనకున్న మక్కువను నిరూపించుకుంది. మొత్తానికి అయితే వోగ్ ఇండియా కవర్ పేజీ కోసం సమంత ఇచ్చిన ఫోజులు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463